క్లుప్తంగా

మొగిలీశ్వరాలయానికి రూ 4.91 లక్షల ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి దుకాణాల లీజు వేలం ద్వారా రూ.4,91,100 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజు తెలిపారు. ఆలయం ఆవరణలో శనివారం దుకాణాల బహిరంగ లీజు వేలంను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ సమక్షంలో నిర్వహించారు. తలనీలాలకు సంబంధించి రూ.3.4 లక్షలు, వాహనాల పార్కింగ్ రూ.85 వేలు, కొబ్బరిచిప్పల పోగు రూ.37,600, పాదరక్షలు భద్రపరచు హక్కుకు సంబంధించి రూ.28,500 ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవించాలి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవించాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 35 మందికి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో ఏడుగురి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తేజోమూర్తి

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ మేళాలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. రెండురోజులుగా మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి సంస్థల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన విద్యార్థుల వివరాలు ఆయన శనివారం వెల్లడించారు. ఆ కళాశాల చైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన షర్మిల, శిరీషరెడ్డి, ప్రత్యూష, కావ్యశ్రీ, పూజిత, కేఎం.పూజిత, వర్ష ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.4 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

16 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.1.60 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 16 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.60 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

'బార్' బరిలో 18 మంది

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాదుల సంఘం (బార్) ఎన్నికల బరిలో మొత్తం 18 మంది న్యాయవాదులు నిలబడ్డారు. బార్ ఎన్నికలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలవగా, పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, శనివారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి చేసిన ఎన్నికల అధికారి వసంతకుమార్ తుదిగా ఎవరు బరిలో ఉన్నారనే వివరాలను ప్రకటించారు.

అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడుతుండగా వీరిలో చంద్రశేఖర్, శంకర్ నాయుడు, హరికృష్ణమ నాయుడు, మోహనరామిరెడ్డి, జానకిరామిరెడ్డి ఉన్నారు. ఉపాధ్యక్షుల బరిలో లోకనాథన్, భూ పసన్న, ప్రధాన కార్యదర్శిగా చక్రవర్తిరెడ్డి, సురేష్‌రెడ్డి, విశ్వనాథ్ పోటీ పడుతున్నారు. కోశాధికారిగా ఎస్.ఆనంద్, దేవేంద్రనాథ్, మహేష్, క్రీడా కార్యదర్శిగా శాంతి, రామచంద్ర యాదవ్, వెంకటేష్, లైబ్రరీ కార్యదర్శిగా వరదరాజులు, రవిచంద్రన్ బరిలో ఉన్నారు. కార్యనిర్వాహక సభ్యులుగా సీనియర్ విభాగంలో చిన్నబ్బ, శరవణ, జూనియర్ విభాగంలో అక్బర్ బాషా, తులసీరామ్, రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక బార్ అసోసియేషన్ ఎన్నికలు జనవరి 3వ తేదీన నిర్వహించనున్నారు. మొత్తం 339 మంది న్యాయవాదులు ఓటర్లుగా ఉండగా, పోలింగ్ పూర్తయిన వెంటనే ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన చేయనున్నారు.

30న ఎస్సీ, ఎస్టీ కమిటీ సమావేశం


పుంగనూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 30న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటి సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులస్తుల సమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చించేందుకు అన్నిశాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

పాలనురగలా.. జిల్లేడుబుగ్గ

SUNDAY SPECIAL

చుట్టూ అడవులు పచ్చని చెట్లు ఎత్తయిన కొండలు సహజసిద్ధంగా జాలువారే జలపాతం. హోరెత్తే నీటి హొయలు. వెరసి ప్రకృతి ఒడిలో అందంగా ఒదిగిపోయిన అద్భుత జలపాతం.. జిల్లేడుబుగ్గ. మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో ఐరాల, సోమల మండలాల సరిహద్దుల్లో 181 ఉప్పరపల్లె అటవీ ప్రాంతంలో ఈ రమణీయమైన జలపాతం ఉంది. ఒకప్పుడు కేవలం స్థానికులే సేదతీరే ప్రాంతంగా మిగిలిపోయిన ఈ జలపాతం.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్నారు.





జలపాతం వద్ద సందర్శకుల సందడి, (ఇన్‌సెట్) జిల్లేడుబుగ్గ నుంచి కొండల మధ్య వస్తున్న నీటి ప్రవాహం

- చూపరులను కట్టిపడేస్తున్న జలపాతం
- పర్యాటక కేంద్రంగా మారిస్తే ఎంతో ఆదరణ

ఐరాల: చుట్టూ కొండలు జలపాత సవ్వళ్లు ఇవి తప్ప మరో శబ్దం వినిపించే అవకాశం లేదిక్కడ. 50 అడుగుల ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ జలపాతం కిందికి దూకుతూ ఉంటుంది. 3 అంచెల్లో సహజ సిద్ధమైన జలపాతాలను కలిగిన ఈ సుందర ప్రదేశం, పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు మధురానుభూతిని పంచుతూ ఎనలేని ప్రకృతి సౌందర్యాన్ని తనలో నిక్షిప్తం చేసుకుని మళ్లీ మళ్లీ రారమ్మని ఆహ్వానిస్తున్నట్టుగా ఉంటుంది.

తీర్చిదిద్దితే చక్కటి పర్యాటక కేంద్రం

మండల కేంద్రానికి 8 కి.మీ.దూరంలో ఉన్న ఈ జలపాతాన్ని తీర్చిదిద్దితే చక్కటి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ జలపాతాల వద్ద సరైన రక్షణ ఏర్పాట్లు లేకపోవడం, అప్పుడప్పుడు కొండల పైభాగంలో ఎలుగుబంట్లు, ఏనుగులు సంచరిస్తూ ఉండడం తదితర కారణాల రీత్యా ఇది అంతగా ఆదరణకు నోచుకోలేదు. వాటి నుంచి రక్షణ దిశగా అధికారులు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే ఈ జలపాతం ఐరాలలో ఓ మంచి పర్యాటక కేంద్రంగా భాసిల్లే అవకాశం ఉందని స్థానికుల అభిప్రాయం.

ఆద్యంతం.. ఆహ్లాదభరితం!

ఎత్తయిన కొండలు ఉండే ఈ జలపాతాన్ని చేరాలంటే కాలినడకన కొంతదూరం గుట్టల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. చుట్టూ అలుముకున్న పచ్చటి అడవి, పైన జలపాతం నుంచి పారే సేలయేటి గలగల సవ్వడులు, పక్షుల కిలకిలా రావాలు ఆహ్లాదాన్ని పంచుతూ ఉంటాయి. కాలుష్యానికి దూరంగా ప్రశాంతమైన ప్రకృతి ఒడిలో హాయిగా సేద తీరేందుకు ఇంతకు మించిన చక్కటి ప్రదేశం ఐరాల సమీపంలో లేదని చెప్పవచ్చు. ఈ జలపాతం నుంచి వచ్చే నీరు మొదటగా మండలంలోని అతిపెద్ద చెరువైన బీరప్పచెరువుకు చేరడం విశేషం. చెరువు నిండి మొరవ సాగితే ఆ నీరు గార్గేయ నది గుండా మిగతా చెరువులకు చేరుకుంటుంది. ఇది పూర్తిగా అటవీ ప్రాంతం కాబట్టి ఎలాంటి సౌకర్యాలు ఉండవు. పర్యాటకులకు ఏమి కావాలన్నా వెంట తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఈ జలపాతాన్ని చూసేందుకు స్థానికులే కాకుండా ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి విశేష అనుభూతి పొందుతున్నారు. అక్కడ చుట్టు పక్కల వంటలు చేస్తూ, పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ, సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

భద్రతా చర్యలు

నీళ్లలో ప్రమాదవశాత్తు పడితే బయటపడేందుకు జలపాతాల వద్ద ఇరువైపులా తాళ్లు ఏర్పాటు చేయాలి. సెలవు రోజులు, ఆదివారాలు జలపాతాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఆ సమయంలో జలపాతాల వద్ద తగిన సంఖ్యలో భద్రతా సిబ్బందిని నియమించాలి. అయితే ఇక్కడ మందుబాబులు, ప్రేమ జంటలపై పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

జలపాతానికి వెళ్లే మార్గం

ఐరాల నుంచి రెడ్డివారిపల్లె మీదుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో ఎడమవైపు వెళ్లాలి. గోవిందరెడ్డిపల్లె నుంచి వినాయకపురం గ్రామానికి చేరుకోవాలి. అక్కడి నుంచి జలపాతానికి మట్టిరోడ్డు గుండా ప్రయాణం చేస్తే మూడు రాళ్ల కొండ వస్తుంది. అక్కడ వాహనాలను నిలిపి అటవీ మార్గంలో సుమారు 2 కి.మీ దూరం నడుచుకుంటూ వెళితే జలపాతాలను చేరుకోవచ్చు.



రాళ్ల బండల మధ్య నుంచి ప్రవహిస్తున్న జలపాతం



పచ్చని చెట్ల మధ్య దూకుతున్న నీటి ప్రవాహం

పైమాఘంలో రెవెన్యూ సదస్సు

తవణంపల్లె: మండలంలోని పైమాఘంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో రోడ్డు సమస్య పరిష్కరించాలని రెండు అర్జీలు, ముటేషన్ కోసం రెండు అర్జీలు, ఆన్‌లైన్‌లో ఖాతా నంబర్లు నమోదు చేయాలని ఒకరు, గ్రామ కంఠంలో ఇంటి పట్టా మంజూరు చేయాలని ఒకరు అర్జీ ఇచ్చారు. సదస్సులో తహసీల్దార్ సుధాకర్, భూరీసర్వే డీటీ వెంకటరమణ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సర్పంచ్ మల్లుదొరై, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల తనిఖీ



పీహెచ్‌సీలో రోగుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సుధారాణి

గుడిపాల: మండలంలో ఉన్న గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తనిఖీలు చేశారు. ఆరోగ్యకేంద్రాల్లో అన్నిరకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రోగులకు అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడుతూ కాన్పులు ప్రభుత్వాస్పత్రుల్లో, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో చేయించాలన్నారు. బీపీ, షుగర్ లెవెల్స్‌ను ఇతర దీర్ఘకాల వ్యాధులను ఏ విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారో తెలుసుకున్నారు. నరహరిపేట హైస్కూల్లో హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా స్క్రీనింగ్ క్యాంపులో తప్పకుండా తెలిపి తగిన చికిత్స అందించాలని సూచించారు. విద్యార్థులు పరిసరాల శుభ్రత పాటిస్తూ, వ్యక్తిగత శుభ్రతలో సబ్బుతో భోజనానికి ముందు, తరువాత చేతులు కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ శిరీషా, ఏపీడీ మియాలజిస్ట్ శ్రీవాణి, మునిశేఖర్, రమేష్, మోహన్‌శెట్టి, డాక్టర్లు రష్మిత, చంద్రమహేష్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఐరాల: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా ఆరోగ్యకరమైన జీవనం పొందవచ్చని పిరమిడ్ మాస్టర్ దామోదర్ అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో శనివారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు ధ్యానం, వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ ధ్యానం, వైద్య శిబిరాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ డాక్టర్ లావణ్య ప్రారంభించారు. దామోదర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, ఈ ఒత్తిడి నుంచి తట్టుకోవాలంటే ధ్యానం చేయడం ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ధ్యానం చేసేందుకు కేటాయించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి గ్రామస్తులకు బీపీ, షుగర్, హెచ్‌బీ, వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ వై రెడ్డిరాము, హెచ్‌ఎం అజిత, పీహెచ్‌ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీ లీలా, వీఏఏలు జోత్స్న, రెడ్డెప్ప, ఆశా కార్యకర్త నీలావతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దామోదర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం డీఎంహెచ్‌ఓ సుధారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, కుక్, వాచ్‌మెన్, స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీలున్నాయన్నారు. వాటిని త్వరితగతిన భర్తీ చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ అలవెన్స్‌లను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినాయకం, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

ఐరాల: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను హెచ్‌ఎం కోమలతో కలిసి వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని ప్రోత్సహించే విధంగా వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. మూడు విభాగాల్లో (విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి గ్రూపు, టీచర్ వ్యక్తిగత) వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీలకు ఏడు ఉన్నత, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయి నుంచి ఒక్కొక్క విభాగంలో ప్రథమ స్థానం సాధించిన వారు మాత్రమే జిల్లా స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో ఉపాధ్యాయ స్థాయిలో ఆర్ సుధా(ఎం.పైపల్లె), వ్యక్తిగత స్థాయిలో పావని, గ్రూపు స్థాయిలో హేమలత, నిఖిత(ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు) జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

అడ్డూఅదుపూ లేని పన్నుల వాత

పలమనేరు: దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రజలపై విధించే పన్నులకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని పలమనేరు ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌బాబు శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. వేతన జీవుల నుంచి ఆదాయపు పన్నును 5శాతం నుంచి 30 శాతానికి పెంచారని తెలిపారు. మిగిలిన సొమ్ముపై జీఎస్టీ 5శాతం నుంచి 28 శాతం దాకా వసూలు చేసి దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రజల నుంచి భారీగా వసూలు చేసిన పన్నుల ద్వారా ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని కూడా ప్రభుత్వాలు అందివ్వడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా ఉద్యోగులకు ఆరు నెలలకోసారి ఇవ్వాల్సిన కరువు భత్యం కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత రాక మునుపే కళ్లు తెరవాల్సిన అవసరం ఉందన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు గంగరాజు, సురేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్కీంవర్కర్లు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్మికుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. తమ హక్కుల కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం ఇతర స్కీం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గిరిధర్‌గుప్తా, గంగ, జ్యోతిరావు, శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్రన్

పల్లెల్లో విజృంభిస్తున్న దోమలు



జాతీయ రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం



బసవాపల్లె రోడ్డులో నిలిచిన వర్షపునీరు

- కానరాని పారిశుధ్యం
- మూలకు చేరిన దోమల నివారణ యంత్రాలు
- పట్టించుకోని కూటమి పాలకులు

గుడిపాల: పల్లెల్లో దోమలు జనంపై దండయాత్ర చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేయిస్తామంటూ హడావుడి చేసిన నాయకులు ఇప్పుడు ఆ సంగతే మర్చిపోయారు. గతంలో పంచాయతీల్లో నిల్వ ఉన్న నిధులు టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు తూతూమంత్రంగా పనులు చేయించి చేతులు దులుపుకున్నారు. అది కూడా కొన్ని గ్రామాల్లోనే నామమాత్రపు పనులు జరిగాయి. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా మురుగు నిల్వలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దోమల నివారణకు ప్రతి సచివాలయానికి ఒక ఫాగింగ్ యంత్రాన్ని అందించి సరిపడా లిక్విడ్ అందజేసి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలో 17 సచివాలయాలకు ఒక్కో ఫాగింగ్ యంత్రాన్ని రూ.65వేలు చొప్పున కొనుగోలు చేసి అందజేశారు. ఎన్నికల ముందు వరకు గ్రామ స్థాయిలో ఉండే సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఫాగింగ్ యంత్రాలు ఉపయోగించి గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. ఫాగింగ్ యంత్రాలు వినియోగించకుండా సచివాలయాల్లోనే మూలన పడేశారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

పంచాయతీల్లో ఖర్చు కాని నిధులు

పంచాయతీ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులను పెద్ద పంచాయతీకి రూ.4 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.2లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను పారిశుధ్యంతోపాటు తాగునీరు, ఇతర వసతులకు ఖర్చులు చేయాల్సి ఉంది. కాలానుగుణంగా నెలకు మూడుసార్లు ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ యంత్రాలకు పెట్రోల్, డీజిల్ వేయడంతోపాటు మలాథియన్, వేస్ట్ ఆయిల్‌తో కలిపి పిచికారి చేయాలి. ఒక్కసారి ఫాగింగ్ చేయాలంటే సుమారు రూ.3 వేల వరకు ఖర్చు అవుతుంది.

ముసురుతో క్షీణించిన పారిశుధ్యం

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఫాగింగ్ యంత్రాలు వినియోగంలోకి తీసుకువచ్చి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ఇంటివద్దే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. మండలంలోని తొప్పాతిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, తేజస్విని, హిందుజా పాల్గొన్నారు.